

మల్టీపర్పస్ వర్కర్ అరెస్ట్
చోరీలకు పాల్పడుతున్న పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌ను సోమవారం అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



సమస్యలు పరిష్కరించాలి
సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఎన్‌ఎంలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. - 9లో



సాగు నీరందించడమే లక్ష్యం
ఆలేరు నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ అతిథిగా 'గుత్తా'

సాక్షి, యాదాద్రి: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు జాతీయ పతాకం ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేయనున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయికి



ఉపాధ్యాయురాలు శిరీష, గుండాల

గుండాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జి.శిరీష యోగా, పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉద్యోగ నిర్వహణలో ఒత్తిళ్లను అధిగమించాలంటే దిన చర్యలో భాగంగా వ్యాయామం, ఆటలు ఉండాలనే ఉద్దేశంతో ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో ఆమె పాల్గొన్నారు. పది యోగాసనాలు వేసి, 80 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నది తన ఉద్దేశమని, వారిలో స్ఫూర్తి నింపేందుకు సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో పాల్గొన్నట్లు శిరీష తెలిపారు. జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల శిరీషను సహచర ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ అభినందించారు.

ఉద్యమకారుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా



ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతిపత్రం ఇస్తున్న మలిదశ ఉద్యమకారుల జేఏసీ నాయకులు

ఆలేరు: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డికి తీసుకువెళతానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. సోమవారం ఆలేరులో ఎమ్మెల్యేను మలిదశ ఉద్యమకారుల జేఏసీ నాయకులు కలిశారు. ఎన్నికల హామీ ప్రకారం పింఛన్‌తోపాటు ఆరోగ్యబీమా కార్డులు, 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో జేఏసీ కన్వీనర్ మొరిగాడి వెంకటేష్, కో-కన్వీనర్లు ఇక్కిరి శ్రీనివాస్,ఆడెపు బాలస్వామి, ఎనగందుల సురేష్,బందెల సుభాష్ ఉన్నారు.

చదువుతోనే భవిష్యత్



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్

చౌటుప్పల్ రూరల్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని డీసీపీ అక్షాంశ్‌యాదవ్ పేర్కొన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని 250 మంది విద్యార్థులకు ప్రకాశం పంతులు ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీ ట్రస్ట్ సమకూర్చిన రూ.1.20 లక్షల విలువైన యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ ఎలికట్టె గురువరావు, ట్రస్ట్ చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ పి.మోహన్‌రావు, ప్రకాశం పంతులు మనుమడు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి టంగుటూరి శ్రీరామ్, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, గట్టు ప్రియాంక, ఉపాధ్యాయులు శివజ్యోతి, ఉస్మాన్, శ్రీలత, అంజయ్య, నిర్మల, రాణి, కవిత, శారద, విజయలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

సాక్షి యాదాద్రి : స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ హనుమంతరావు అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్ల తొలగింపు విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు



నల్లగొండలోని ఎంజీయూ స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ బీఎస్.మూర్తి, ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, తదితరులు



కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ అందుకుంటున్న పి.రవికుమార్



గోల్డ్ మెడల్ పొందిన ఆనందంలో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు

'మహా'నందం

నల్లగొండ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ)లో సోమవారం నిర్వహించిన స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందజేశారు. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. -8లో

బతుకమ్మ చీరలొస్తున్నాయ్..

స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంతన్న కానుక

- ఒక్కొక్కరికి రెండు చీరలు పంపిణీ
- మొత్తం 1,59,482 మంది సభ్యులు
- రెండు రోజుల్లో జిల్లాకు చేరనున్న చీరలు



సాక్షి, యాదాద్రి: బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేయనుంది. ఇందిరా మహిళా శక్తి పథకం పేరుతో ఒక్కో మహిళకు రెండు చీరలు ఇవ్వనున్నారు. చీరలు రెండు రోజుల్లో జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే అర్హుల జాబితాను మెప్మా, సెర్ప్ అధికారులు సిద్ధం చేశారు.

18 ఏళ్ల వయస్సు నిండిన వారందరికీ..

స్వయం సహాయక సంఘాల్లో 18 ఏళ్ల వయసు నిండిన మహిళలందరికీ చీరలు పంపిణీ చేయనున్నారు. బతుకమ్మ పండుగ నాటికి పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వానికి ఇచ్చిన ఇండెంట్ మేరకు జిల్లాకు మూడు లక్షల వరకు చీరలు రానున్నాయి.

రేవంతన్న కానుక పేరుతో..

అక్కా చెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక పేరుతో నేత చీరలు పంపిణీ చేయనున్నారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ పండుగ సందర్భంగా 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ ఒక్కో చీర చొప్పున పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రెండు చీరలు ఇవ్వనున్నారు.

ఆకర్షణీయంగా డిజైన్లు

బతుకమ్మ చీరలను సిరిసిల్లలో పవర్‌లూమ్స్‌పై తయారు చేస్తున్నారు. వీటికి గుజరాత్‌లోని సూరత్‌లో ప్రింటింగ్, ప్రాసెసింగ్ చేస్తున్నారు. డిజైన్లు, ప్యాకింగ్ అంతా సూరత్‌లోనే జరుగుతుంది. ఆకర్షణీయంగా వివిధ డిజైన్లతో చీరలు తయారు చేస్తున్నారు.

సంఘాల్లో సభ్యులు ఇలా..

జిల్లాలో 14,848 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో 1,59,482 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 50 ఏళ్ల వయసులోపు వారు 1,19,373 మంది, 50 ఏళ్ల పైబడిన సభ్యులు 39,617 ఉన్నారు. వీరితో పాటు 492 మంది గోచి చీర ధరించే వారికి 9 మీటర్ల చీరలు పంపిణీ చేయనున్నారు. గోచి చీరలు ధరించే సభ్యులు ఆత్మకూర్(ఎం), రాజాపేట, బొమ్మలరామారం, సంస్థాన్‌నారాయణపురం, తుర్కపల్లి మండలాల్లో ఉన్నారు.

రామన్నపేట, మైలారం గోదాములలో నిల్వ

సిరిసిల్ల నుంచి చీరలు రాగానే రెండు గోదాముల్లో నిల్వ చేయనున్నారు. ఇందులో రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో రెండు లక్షలు చీరలు నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో సెర్ప్ 85,658 చీరలు, మెప్మాకు సంబంధించి 13,517 మొత్తం 99175 చీరలు నిల్వ చేస్తారు. బొమ్మలరామారం మండలం మైలారం మార్కెట్ కమిటీ గోదాంలో లక్ష చీరలు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఇందులో సెర్ప్ 73,824, మెప్మా 18,812 మొత్తం 92,636 చీరలు నిల్వ చేయనున్నారు. అక్కడినుంచి మున్సిపల్ కేంద్రాలు, గ్రామ పంచాయతీలకు సరఫరా చేస్తారు.



స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు

మండలం	సంఘాలు	సభ్యులు
అడ్డగూడూరు	639	7,125
ఆలేరు	644	6,907
ఆత్మకూర్ (ఎం)	670	7,459
భువనగిరి	1100	11,934
బీబీనగర్	1,170	12,523
బి.రామారం	886	9,153
చౌటుప్పల్	963	10,290
గుండాల	775	8,234
తుర్కపల్లి	862	9,123
మోటకొండూరు	578	6,238
మోత్కూరు	370	3,934
నారాయణపురం	1173	12,473
పోచంపల్లి	790	8,543
రాజాపేట	855	9,246
రామన్నపేట	1,201	13,030
వలిగొండ	1,341	14,570
యాదగిరిగుట్ట	831	8700

మున్సిపాలిటీల్లో..

పట్టణం	సంఘాలు	సభ్యులు
ఆలేరు	384	3,584
భువనగిరి	1,252	11,869
చౌటుప్పల్	614	5,975
మోత్కూరు	366	3,387
పోచంపల్లి	429	4,155
యాదగిరిగుట్ట	355	3,359
మొత్తం	3,400	32,329

చీరల పంపిణీకి కలెక్టర్ అధ్యక్షతన కమిటీ

ఒక్కో సభ్యురాలికి రెండు చీరలు పంపిణీ చేస్తాం. చీరల పంపిణీకి కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశారు. మండలం, మున్సిపాలిటీస్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ఇంచార్జ్‌లుగా ఉంటారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలో వార్డు అధికారులు, వీఓలు, ఆర్పీలు ఇంచార్జ్‌లుగా ఉంటారు. వార్డు కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో చీరల పంపిణీ ఉంటుంది. –నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

అతివల ఆరోగ్యానికి అభయం

17నుంచి 'స్వస్థ్‌నారీ.. సశక్త్ పరివార్ అభియాన్'

- 16 రోజులు, 80 వైద్యశిబిరాలు
- చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు వైద్య పరీక్షలు

ఆలేరు: మారుతున్న జీవనశైలి.. వాతావరణ మార్పుల కారణంగా మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈనేపథ్యంలో అతివల ఆరోగ్య రక్షణకు కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. కుటుంబ వ్యవస్థలో అతి కీలకంగా వ్యవహరించే మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరిచి తద్వారా ఆ కుటుంబం.. దేశాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో 'స్వస్థ్‌నారీ..సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించింది. ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు వైద్యారోగ్య శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలతో ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు.



భువనగిరి జనరల్ ఆస్పత్రిలో ప్రారంభం

'స్వస్థ్‌నారీ..సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని భువనగిరిలోని జనరల్ ఆస్పత్రిలో ప్రారంభించనున్నారు. అక్టోబర్ 1వ తేదీన ఇదే ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు.

అన్ని ఆస్పత్రుల్లో మెడికల్ క్యాంపులు

ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ మందిరాలు, భువనగిరిలోని జనరల్ ఆసుపత్రి, బస్తీ దవాఖానాల పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

సేవలు ఇవీ..

- వైద్యశిబిరాల్లో నేత్ర, దంత, చర్మ, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి, డెర్మటాలజీ, సైక్రియాట్రిస్ట్ వైద్యనిపుణులు పాల్గొని సేవలందిస్తారు.
- బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, హిమోగ్లోబిన్, నేత్ర, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేస్తారు. అవసరమైన మందులను అక్కడికక్కడే అందజేస్తారు.
- 0నుంచి ఐదేళ్ల చిన్నారులకు టీకాలు వేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి రోజూ జిల్లాలో ఆస్పత్రుల పరిధిలో ఐదు వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. మహిళలతో పాటు చిన్న పిల్లలకు కూడా పరీక్షలు చేస్తారు. అనారోగ్య సమస్యలు, పౌష్టికాహార లోపాలను గుర్తిస్తారు. పౌష్టికాహార లోపం ఉన్న వారిని నల్లగొండలోని న్యూట్రిషియన్ రిహాబిలిటేషన్ సెంటర్(ఎన్ఆర్‌సీ)కు, ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళలను చికిత్స కోసం బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు రెఫర్ చేస్తాం. – డాక్టర్ యశోధ, నోడల్ అధికారి

మొర ఆలకించి.. వినతులు స్వీకరించి



రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు అందజేసిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- అత్యధికంగా రెవెన్యూ సమస్యలపైనే..

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి అర్జీలు అందజేశారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి కలెక్టర్ హనుమంతరావు వినతులు స్వీకరించారు. బాధితుల మొర ఆలకించారు. వినతులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మోత్కూరు మండలం దత్తప్పగూడేనికి చెందిన బాతుక ఐలమ్మ భర్త మల్లయ్య భూ భారతి రెవెన్యూ సదస్సులో పెట్టుకున్న దరఖాస్తును కలెక్టర్ అప్పటికప్పుడు పరిష్కరించారు.మొత్తం 54 అర్జీలు రాగా రెవెన్యూకు సంబంధించి 41 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌ఓ జయమ్మ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

- ఆలేరు మున్సిపాలిటీలో పరిధిలో దళితులకు ఇచ్చిన 2.20 ఎకరాల భూమి కొందరు ఆక్రమించుకొని ప్లాట్లు చేసి అమ్మకాలు చేస్తున్నారని, వెంటనే అడ్డుకోవాలని పట్టణానికి చెందిన పలువురు దళితులు వినతి పత్రం అందజేశారు.
- ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లను తొలగించలేదని, సవరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎండీ షరీఫ్ వినతిపత్రం అందజేశారు.

అలైన్‌మెంట్ మార్చాలి

సాక్షి,యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.జీవనాధారమైన భూములు కోల్పోతున్నామని, ప్రజాప్రయోజనాలకని తరచూ భూములు తీసుకుంటే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్నామన్న వేదనతో రాయగిరికి చెందిన ముగ్గురు రైతులు గుండెపోటుతో మరణించారని వాపోయారు. రీజినల్ రింగ్ రోడ్డును ఆపకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్వచ్ఛోత్సవాలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు



అధికారులతో కలిసి స్వచ్ఛోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : స్వచ్ఛతా–హీ–సేవ 2025 –స్వచ్ఛోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు కోరారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యులను చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌ఓ జయమ్మ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయసింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చేపట్టనున్న కార్యక్రమాలు ఇవీ..

శ్రమదానాలు, పిచ్చిమొక్కలు, గడ్డి తొలగింపు, తడి పొడి చెత్త నిర్వహణపై ఇంటింటికీ అవగాహన కార్యక్రమాలు, వాడి పడేసిన వస్తువులను కళాత్మకంగా తయారు చేసి పునర్వినియోగంలోకి తీసుకువచ్చే వస్తువులను విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శుల చేత తయారు చేయించనున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు, రక్షణ కిట్లు పంపిణీ చేస్తారు. వీటితో పాటు స్వచ్ఛతా ర్యాలీలు, స్వచ్ఛతా రన్, స్వచ్ఛతా మానవహారం, స్వచ్ఛతా ప్రతిజ్ఞ, స్వచ్ఛతపై వ్యాస రచన, కవితలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. చెత్త పేరుకుపోయిన, సమస్యాత్మక స్థలాలు గుర్తించి శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు స్వచ్ఛతోత్సవాల్లో చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

శివాలయంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలో స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల సేవను ఊరేగించారు. ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. సుప్రభాత సేవ, ఆరాధన, నిజాభిషేకం, అర్చన, సుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, తదితర పూజలు నిర్వహించారు.



శివపార్వతుల సేవను ఊరేగిస్తున్న అర్చకులు

వామ్మో..జగదేవ్‌పూర్ చౌరస్తా

నిత్యకృత్యంగా ప్రమాదాలు

- ఇరువైపులా ఆక్రమణలు, అధ్వానంగా రోడ్లు
- నెల రోజుల వ్యవధిలోనే ముగ్గురు మృతి, పలువురికి గాయాలు



జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద మోకాలు లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిన రహదారి

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ చౌరస్తా ఆక్రమణలతో ఇరుకుగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ నెల రోజుల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. మరెంతో మంది క్షతగాత్రులయ్యారు.

రెండు జాతీయ రహదారులకు అనుసంధానం

వరంగల్ – హైదరాబాద్, భువనగిరి – ప్రజ్ఞాపూర్ జాతీయ రహదారులకు జగదేవ్‌పూర్ చౌరస్తా అనుసంధానంగా ఉంటుంది. ఇక్కడ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది.మితిమీరిన వేగంతో రావడంతో ప్రమాదాలు జరుగుతుంటా యి. ఆగస్టు 3న లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈనెల 12న జరిగిన ప్రమాదంలో బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు వదలగా, ఒకరు గాయపడ్డారు.

పరిశీలించిన అదనపు కలెక్టర్

జగదేవ్‌పూర్ చౌరస్తాను అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.. ఎన్‌హెచ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రామలింగంతో కలిసి సోమవారం పరిశీలించారు. ఆక్రమణలను తొలగించి, మార్కింగ్ చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ఇదొక్కటే మార్గమని, ప్రజలు సహకరించాలని కోరారు.

కళ్లెదుటే ప్రమాదాలు జరుగుతున్నాయి



జగదేవ్‌పూర్ చౌరస్తాలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతుంది. మా కళ్లెదుటే రోడ్డు ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు పోతుంటే భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. –హరిశంకర్, ఆటోడ్రైవర్

రోడ్ల విస్తరణతోనే ప్రమాదాల నివారణ

- ప్రజలు సహకరించాలి
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్

సాక్షి, యాదాద్రి: జిల్లా కేంద్రంలో ప్రమాదల నివారణకు రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందని, ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి కోరారు. సోమవారం భువనగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అయ్యారు. ప్రాణాంతకంగా మారిన జగదేవ్‌పూర్ రోడ్డును మరింత వెడల్పు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. హన్మాన్‌వాడ రోడ్డు, హైదరాబాద్ చౌరస్తానుంచి నల్లగొండ రోడ్డును వెడల్పు చేయటంతో పాటు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జగ్‌దేవ్‌పూర్ చౌరస్తాలో ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో జగదేవ్‌పూర్ రోడ్డు మధ్యలో డివైడర్లు, ఇరువైపులా జాలీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జగదేవ్‌పూర్ ఫ్లై ఓవర్ మరమ్మతులకు రూ.75 లక్షలు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ఆర్టీసీ బస్టాండ్ అద్దె మడిగెలు, బ్యాంకు, రిలయన్స్‌మాల్, రైతుబజార్, రాఘవేంద్ర హోటల్ పార్కింగ్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సెల్లార్లను పార్కింగ్‌కు ఉపయో గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం, సీఐ రమేష్, ప్రజాసంఘాల నాయకులు భట్టు రామచంద్రయ్య, కుక్కదువ్వు సోమయ్య, బీసుకుంట్ల సత్యనారాయణ, బట్టుపల్లి అనురాధ, మెరుగు మధు, దిడ్డి బాలాజీ, ఏశాల అశోక్, ఎండీ ఇమ్రాన్, ఆగేశ్వర్ రావు, భువనగిరి వెంకటరమణ, మాటూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఎంజీయూ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు
- పాల్గొన్న ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జరిగిన 4వ స్నాతకోత్సవానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై 22 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 57 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. గవర్నర్‌కు నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణ అమిత్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియం వద్ద మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంస్థలంటే సమాజానికి దార్శనికత, విలువలు నేర్పేందుకు రూపొందించబడిన జీవన వ్యవస్థలని అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం విద్యతో పాటు పరిశోధనలు, ఆవిష్కరణలు, సేవా కార్యకలాపాల్లో అద్భుతమైన పురోగతి సాధిస్తూ విద్యార్థులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరును బలోపేతం చేయడం, హాస్టల్, క్యాంపస్ సౌకర్యాలను మెరుగుపరచడం, సమ్మిళిత అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడంపై యూనివర్సిటీ చూపుతున్న శ్రద్ధ ప్రశంసలకు అర్హమైందన్నారు. యూనివర్సిటీని జాతీయ స్థాయి విద్యాసంస్థగా తీర్చిదిద్దడంలో పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ పెంపొందించడం చాలా అవసరమన్నారు. దేశ పురోగతి ఆ దేశ మానవ ప్రతిభపై ఆధారపడి ఉంటుందని.. పరిశోధన, ఆవిష్కరణలు దీనికి కీలకమన్నారు. కోవిడ్–19 వ్యాక్సిన్ అభివృద్ధి మన దేశ సత్తాను ప్రపంచానికి చాటిందన్నారు. ప్రస్తుతం భారత దేశం బహుళ రంగాల్లో రాణిస్తోందని, యూనివర్సిటీలు యువ మనస్సులను సజనాత్మకత, ఆవిష్కరణలతో పెంపొందిస్తాయన్నారు. భారత దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులు పరిశ్రమలు నెలకొల్పేలా సిద్ధం చేయాలని కోరారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా కలలు కనండి.. కలలు ఆలోచనలుగా రూపాంతరం చెందుతాయి, ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్నారు. అదేవిధంగా ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఏడీసీ భవానీప్రసాద్, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి దేవసేన, యూనివర్సిటీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్ తదితరులు గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



స్నాతకోత్సవంలో జాతీయ గీతం ఆలపిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తదితరులు



ఎంజీయూలో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ తదితరులు



ఎంజీయూ విద్యార్థులు తయారుచేసిన సోలార్ వాహనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ





స్నాతకోత్సవంలో పాల్గొన్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, విద్యార్థులు

అట్టహాసంగా స్నాతకోత్సవం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన నాల్గవ స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

గోల్డ్ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉంది



నేను నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాను. 2022 బ్యాచ్‌కు చెందిన నేను ప్రభుత్వ కాలేజీలో చదివిన విద్యార్థిగా గవర్నర్ చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో ఎంజీయూలోనే పీహెచ్‌డీ పూర్తిచేస్తాను. – ఎస్. వర్షిత, నల్లగొండ

అసిస్టెంట్ ప్రొఫెసర్ అవుతా



మహబూబాబాద్ సమీపంలోని ఒక చిన్న గ్రామంలో పుట్టిన నేను మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్‌డబ్ల్యూ చేసి గోల్డ్ మెడల్ సాధించాను. గిరిజన కుటుంబంలో పుట్టిన నాకు గోల్డ్ మెడల్ రావడం గర్వకారణంగా భావిస్తున్నాను. భవిష్యత్తులో అసిస్టెంట్ ప్రొఫెసర్ అవుతాను. – బానోతు రవి, పెద్దనాగారం, మహబూబాబాద్

పరిశోధనలు చేస్తా



ఎంఎస్సీ బీఈడీలో గోల్డ్‌మెడల్ సాధించడం ఆనందంగా ఉంది. పీహెచ్‌డీ ఫస్ట్ లెవల్ పూర్తిచేశాను. పీహెచ్‌డీ పూర్తిచేసి దేశానికి అవసరమైన పరిశోధనలు చేసి దేశాభివృద్ధిలో భాగస్వామిని అవుతాను. – సాయి స్పందన, నల్లగొండ

ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఎంజీ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తిచేసి గోల్డ్ మెడల్ అందుకున్నాను. భవిష్యత్తులో తప్పకుండా ప్రొఫెసర్ అయ్యి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతాను. – మారోజు భవాని, నల్లగొండ

సామాజిక సేవ చేయాలని ఉంది



ఎంఎస్ డబ్ల్యూ, పీజీ పూర్తి చేశాను. పల్లెటూరులో పుట్టిన నేను గోల్డ్‌మెడల్ అందుకోవడం ఆనందంగా ఉంది. సామాజిక సేవ చేయాలని ఉంది. – గూడూరు స్పందన, దీపకుంట, నల్లగొండ

గ్రూప్–1 సాధిస్తా



హాలియాలోని డిగ్రీ కాలేజీలో ఎంఎస్ డబ్ల్యూ, పీజీ పూర్తి చేశాను. గ్రామీణ ప్రాంతానికి చెందిన నాకు గోల్డ్ మెడల్ రావడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాను. భవిష్యత్తులో గ్రూప్–1 ఉద్యోగం సాధించి పేద ప్రజలకు సేవ చేయాలనే కోరిక ఉంది. – పి. రమ్య, హాలియా

గోల్డ్ మెడల్ గ్రహీతలు



బిలైద్ హారిక, ఎంకామ్ | కట్టబత్తిని మౌనిక, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ | రేణికింది శ్రావణి, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ | గడ్డం వసుంధర, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ | శ్రీరాముల సుజన, ఎంబీఏ ఫైనాన్స్



ఉయ్యాల భువనేశ్వరి, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ | బొల్లు రవళి, ఎంబీఏ | పసుపులేటి శ్రావణి, బీటెక్ సీఎస్ఈ | నారబోయిన వర్షిత, బీకాం | మారోజు భవాని, ఎంఏ ఇంగ్లిష్



నందిగామ మౌనిక, ఎంఏ ఎకనామిక్స్ | రేణిగుంట్ల గాయత్రి, ఎంకామ్ | గూడూరు స్పందన, ఎంఎస్ డబ్ల్యూ | ముంత నాగరాణి, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ | బుస్సు రేణుక, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ



అల్లెందల నవీన్‌కుమార్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ | మొత్కూరి సాయిలీష, ఎంఎస్సీ ఫిజిక్స్ | రెహమాన్ రహీల, ఎంఎస్సీ జువాలజీ | గోకార లిఖిత భార్గవి, ఎంఎస్సీ బయోటెక్నాలజీ | కందుల సౌజన్య, ఎంబీఏ ఫైనాన్స్



చౌడపునేని శ్రీలక్ష్మీ నారాయణ, ఎంసీఏ | మురహరికర్ అఖిల, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ | ఆరుట్ల మహేష్, ఎంబీఏ | బోరాణ శ్వేత, బీటెక్ | బొమ్మకంటి పూజ, బీకాం



నందిపట్ల రమ్యశ్రీ, బీబీఏ | సుమయ్య బేగం, ఎంఏ ఇంగ్లిష్ | తుమ్మ ఆకాష్‌కుమార్, ఎంఏ ఎకనామిక్స్ | జలకం భవాని, ఎంఏ ఎకనామిక్స్ | వట్టి కోటి పూజ, ఎంకామ్



పతనబోయిన రమ్యశ్రీ, ఎంఎస్ డబ్ల్యూ | బానోతు రవి, ఎంఎస్ డబ్ల్యూ | పుప్పల కావ్య, సైన్స్ ఫ్యాకల్టీ | మర్రి స్వాతి, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ | ఆరుట్ల శివనగేష్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ



నత్తి విజయలక్ష్మి, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ | జల్లల రుచిత, ఎమ్మెస్సీ ఫిజిక్స్ | రఘు నైపుణ్య, ఎంఏ ఇంగ్లిష్ | రత్లవత్ మౌనిక, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ | రావిరాల ప్రణతి, ఎంబీఏ ఫైనాన్స్



అమ్మిరెడ్డి దివ్య, ఎంసీఏ | ఎర్రమల్ల నవ్య, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ | కె. భానుప్రకాష్, ఎంబీఏ | ఏషాల అజయ్‌కుమార్, బీటెక్



మారోజు పల్లవి, బీటెక్ | పదరాజు యామిని, బీకాం | కటకమోజు భవాని, బీపీఏ | దాసరి సాయి స్పందన, ఎమ్మెస్సీ జువాలజీ

పీహెచ్‌డీ పొందినవారు



కళ్యాణి, బిజినెస్ మేనేజ్‌మెంట్ | డి. వెంకటేష్, బిజినెస్ మేనేజ్‌మెంట్



జి. రాజేందర్‌గౌడ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | రమేష్ కాలిక్, బిజినెస్ మేనేజ్‌మెంట్



బాల శ్రీప్రసాద్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | శ్యామ్‌సుందర్ తుమ్మ, బిజినెస్ మేనేజ్‌మెంట్



బానోతు రాజేంద్రనాథ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ | వెల్సూరి హరిబాబు, బిజినెస్ మేనేజ్‌మెంట్



కె. వందన, బిజినెస్ మేనేజ్‌మెంట్ | ఎ. మమత శ్రీదేవి, బిజినెస్ మేనేజ్‌మెంట్



వెలమకన్ని రాణీపద్మిని, బయో కెమిస్ట్రీ | డి. ప్రవీణ్, కెమిస్ట్రీ



సి. ఉషాభవాని, మ్యాథమెటిక్స్ | ఎంపీ మేరి న్యాగి, కెమిస్ట్రీ



ఎండీ ఖదీర్, కెమిస్ట్రీ | జీవీఆర్ సాయిమధుకర్, కెమిస్ట్రీ



జి. ప్రభాకర్, కెమిస్ట్రీ | వరికుప్పల పరుశురాం, కెమిస్ట్రీ



వి. శ్రీధర్, కెమిస్ట్రీ | పరకాల నరేష్, మ్యాథమెటిక్స్

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

మేళ్లచెరువు: చింతలపాలెం మండలం చింత్రియాలకు చెందిన బడుగుల సైదమ్మ (54) ఆదివారం గేదెలు మేపేందుకు గ్రామ పరిధిలోని కృష్ణా నది వద్దకు వెళ్లి గల్లంతు కాగా.. మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఆమె కుమారుడు గోపిరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకయ్య తెలిపారు.

అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీ పట్టివేత

గరిడేపల్లి: అక్రమంగా ధాన్యం తరలిస్తున్న లారీని సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు గరిడేపల్లికి చేరుకొని లారీలోని ధాన్యం బస్తాలను పరిశీలించారు. ప్రభుత్వ సంచుల్లో ధాన్యాన్ని ఏపీలోని మండపేటకు తరలిస్తున్నట్లు గుర్తించి పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు.

యూరియా కొరత దేశవ్యాప్తంగా ఉంది

- రైతులను బీఆర్ఎస్ రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తోంది
- మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్‌మెన్ యూరియాను పక్కదారి పట్టించారనడంలో వాస్తవం లేదు
- నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు

నల్లగొండ: యూరియా విషయంలో రైతులను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని బీఆర్ఎస్ పార్టీ చూస్తోందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనా నుంచి సరఫరా తగ్గిపోవడం వల్ల తెలంగాణలోనే కాదు దేశ వ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడిందన్నారు. కేంద్రం నుంచి యూరియా వస్తే రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పంపిణీ చేస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాతో ప్రధాని మోదీ మాట్లాడారని దాంతో యూరియా దిగుమతి జరుగుతుందన్నారు. త్వరలోనే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు. గతేడాది ఇదే సీజన్‌లో నల్లగొండ జిల్లాలో 57 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేస్తే ఈ సంవత్సరం ఇప్పటికే 61 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. 4 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఈ సీజన్‌లో అధికంగా పంపిణీ చేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు అధికారుల వద్దకు పోయి వివరాలు తీసుకుని మాట్లాడాలి కానీ, రాజకీయ లబ్ధి కోసం రైతులను రెచ్చగొట్టడం సరైంది కాదన్నారు. ఈసారి జిల్లాలో 5.68 లక్షల ఎకరాల్లో పత్తి, 5.35 లక్షల ఎకరాల్లో వరి సేద్యం చేశారని, దానికి అనుగుణంగా యూరియాలో ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్‌మెన్ యూరియా పక్కదారి పట్టించారనడంలో వాస్తవం లేదని ఎంపీ రఘువీర్ స్పష్టం చేశారు. ఈ సంఘటనపై తాను కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడానని, వారు ఈ సంఘటనపై విచారణ చేసి ఎలాంటి పొరపాటు జరగలేదని తేల్చినట్లు ఎంపీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అబ్బగోని రమేష్, వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 21ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ), చిట్యాల: ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి పోక్సో యాక్టు కింద 21 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎస్.రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన దోమల రాములు 2018 ఫిబ్రవరి 1వ తేదీన అదే గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తల్లితండ్రులకు తెలియడంతో చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి 21 ఏళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. భరోసా సెంటర్ లీగల్ అధికారిణి ఎం.కల్పన, లయన్ ఆఫీసర్ పి.నరేందర్, ఎన్.మల్లిఖార్జున్ కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించి నిందితుడికి శిక్ష పడడంలో సహకరించారు.

9నెలల్లో 15 జైలు శిక్షలు

నల్లగొండ జిల్లా పోక్సో కోర్టు జనవరి నుంచి ఇప్పటి వరకు 15 పోక్సో కేసుల్లో నిందితులకు జైలుశిక్ష విధించింది. నిందితులందరికీ 20ఏళ్లకు పైగా జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది.

ఉరేసుకుని ఆత్మహత్య

బీబీనగర్: బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన మార్త శ్రీవెన్నెల(17) ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. సోమవారం మృతురాలి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శ్రీవెన్నెల ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.



శ్రీవెన్నెల (ఫైల్)

చోరీలకు పాల్పడుతున్న మల్టీపర్పస్ వర్కర్ అరెస్ట్

- తోటి సిబ్బంది ఇంట్లో కూడా దొంగతనానికి పాల్పడిన వైనం
- ఆరు తులాల బంగారం, 180 గ్రాముల వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పక్కన కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం

కోదాడరూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా చోరీలకు పాల్పడుతున్న గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌ను సోమవారం అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కోదాడ రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండల పరిధిలోని ఖానాపురం గ్రామానికి చెందిన బండ్ల భాస్కర్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఖాళీ సమయంలో తాపీ మేస్త్రీ పనికి వెళ్తున్నాడు. ఏడాదిన్నర కిందట అతడి తల్లిదండ్రులు ఇద్దరూ అనారోగ్యం బారిన పడి నెల రోజుల వ్యవధిలో మృతిచెందారు. వారి వైద్యం కోసం, కుటుంబ పోషణ కోసం సుమారు రూ.8లక్షల వరకు అప్పులు తెచ్చాడు. పిల్లల చదువుల ఖర్చులు ఎక్కువ కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ పంచాయతీ విధుల్లో భాగంగా ఉదయం వేళ గ్రామంలో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవాడు. ఏడాదిన్నర క్రితం ఖానాపురం గ్రామానికి చెందిన పిడమర్తి సుశీల ఇంట్లో, ఈ ఏడాది మార్చిలో తొర్రికొండ కృష్ణకుమారి, కొంగల గంగ ఇళ్లలో, ఆగస్టులో తోటి మల్టీపర్పస్ వర్కర్ గుండ్లపల్లి ఏడుకొండలు ఇంట్లో భాస్కర్ చోరీలకు పాల్పడి ఆరు తులాల బంగారు ఆభరణాలు, 180 గ్రాముల వెండి దొంగలించాడు. దొంగిలించిన బంగారంలో కొంత తాకట్టు పెట్టాడు. మిగిలిన బంగారాన్ని కూడా తాకట్టు పెట్టేందుకు సోమవారం కోదాడకు వెళ్తూ.. గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడి నుంచి ఆరు తులాల బంగారం, 180 గ్రాముల వెండితో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగం, అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది రామారావు, నిరంజన్, ఏడుకొండలు, సీహెచ్. నరసింహారావును డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.